సాక్షి
బాపట్ల
బుధవారం । 18 । డిసెంబర్ । 2024




గోదాదేవికి సారె

మంగళగిరి: ఆత్మకూరు బాపూజీ విద్యాలయ ఆవరణలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం గోదాదేవికి సారె సమర్పించారు.



ధనుర్మాస పూజలు

వినుకొండ(నూజెండ్ల): ధనుర్మాస ప్రారంభం సందర్భంగా పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న పురాతన కోదండ రామస్వామి గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 579.50 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,086 క్యూసెక్కులు విడుదలవుతోంది.

కొన్నది గోరంతే

- అధికారులు, మిల్లర్లు కుమ్మక్కు
- తేమ శాతం సాకు చూపి కొనని అధికారులు
- వాతావరణం పేరుతో తరచూ కొనుగోళ్లు నిలిపివేత
- ఆందోళనతో దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- రూ.1300లకు కూడా కొనని మిల్లర్లు
- గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్న అన్నదాతలు

ధాన్యం కొనుగోలులో దగా చేస్తున్న కూటమి సర్కారు



కోత కోసిన వరి పంట

సాక్షి ప్రతినిధి,బాపట్ల: శ్రమకోర్చి పండించిన పంటను కూటమి సర్కార్ సక్రమంగా కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం రైతులు లబోదిబోమంటున్నారు. పండించిన మొత్తం ధాన్యాన్ని గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం అన్నదాతలు పండించిన ధాన్యంలో పట్టుమని 15 శాతం కూడా కొనే పరిస్థితి కానరావడంలేదు. మిల్లర్లతో కుమ్మక్కైన అధికారులు తేమ శాతం ఇతర ఆంక్షలు పెట్టి ధాన్యాన్ని సక్రమంగా కొనడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల అండతో మిల్లర్లు ధాన్యం కొనడానికి ముందుకు రావడంలేదు. మరోవైపు బయట మార్కెట్‌లో ధాన్యం ధరలు పూర్తిగా పడిపోయాయి. దీంతో రైతుల పరిస్థితి ముందు నుయ్యి..వెనుక గొయ్యిలా తయారైంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మరోవైపు బయట మార్కెట్లోనూ బస్తా ధాన్యం రెండువేల పైచిలుకు ధర పలికింది. దీంతో అన్నదాతలు ఆనందంగా గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని అమ్ముకున్నారు. కూటమి పాలనలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. చంద్రబాబు ప్రభుత్వం పేరుకు బస్తా ధాన్యాన్ని రూ.1740కి కొంటామని చెప్పినా మొక్కుబడిగా కూడా ధాన్యం కొనడంలేదు. బయట మార్కెట్‌లో అమ్ముకుందామంటే బస్తా ధాన్యం రూ.1300లకు మించి లేదు. తరచూ వర్ష సూచనలతో ఆకాశం మబ్బులతో ఉంటోంది. ఏక్షణాన వర్షం కురుస్తుందోనని రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇదే సాకు చూపి ప్రభుత్వం తరచూ ధాన్యం కొనుగోళ్లు నిలిపి వేస్తోంది. దీంతో కోసిన పంటను ఆరబెట్టుకునే అవకాశం లేక అటు దాచుకునే వసతి లేక రైతులు తక్కువ ధరకే మిల్లర్లకు తెగనమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు.

రైతులను ఆదుకోని అధికారులు

ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఏమాత్రం శ్రద్ధ కనబరచక పోవడంతోపాటు మిల్లర్లతో లాలూచీపడి సక్రమంగా ధాన్యాన్ని కొనడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులను లోబరుచుకున్న మిల్లర్లు ప్రభుత్వం తరపున గిట్టుబాటు ధర ఇచ్చి ధాన్యం కొనక పలు రకాల ఆంక్షలతో రైతులను బెదిరించి తక్కువ ధరకు ధాన్యాన్ని కొట్టేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తూ మిన్నకుండి పోతున్నారు. దీంతో ధాన్యానికి గిట్టుబాటు ధర రాక రైతులు నష్టపోతున్నారు.

అరకొర ధాన్యాన్ని కూడా కొనని సర్కార్

జిల్లాలో బాపట్ల, చీరాల, రేపల్లె వ్యవవసాయ డివిజన్లలోని 25 మండలాల పరిధిలో ఖరీఫ్‌లో రైతులు 2,16,434 ఎకరాల్లో వరి పంట సాగుచేశారు. 5,62,729 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా కట్టారు. ఇప్పటివరకూ బాపట్ల పరిధిలో 2129.6 ఎకరాలు, చీరాలలో 64 ఎకరాలు, రేపల్లె పరిధిలో 26,593.33 ఎకరాల చొప్పున మొత్తం 28,786.96 ఎకరాల్లో కోతలు పూర్తి చేశారు. దీని పరిధిలో 74,846.08 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని అంచనా కట్టారు. ఇందులో ప్రభుత్వం 17,234.760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. మిగిలిన ధాన్యాన్ని రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారు. ఇంకా బాపట్ల పరిధిలో 49,489 ఎకరాలు, చీరాలలో 18,990 ఎకరాలు, రేపల్లె పరిధిలో 1,19,173.57 ఎకరాల చొప్పున మొత్తం 1,87,647.50 ఎకరాల పంట మిగిలివుంది. ప్రస్తుతం సుమారు 19 వేల ఎకరాల వరిపంట కోత దశలో ఉంది. ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడడంతోపాటు మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో వరి సాగు	2,16,434 ఎకరాలు
ఇప్పటివరకు కోతలు పూర్తి	28,786 ఎకరాలు
ప్రస్తుతం కోత దశలో ఉన్నది	19 వేల ఎకరాలు
పెండింగ్	1,68,648 ఎకరాలు
దిగుబడి	74,846 మెట్రిక్ టన్నులు
సర్కారు కొన్నది	17,234 మెట్రిక్ టన్నులు

తిరగలేక తక్కువ ధరకు అమ్ముకున్నా..



కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్ముకోవాలంటే పొలం పనులు మానుకొని కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. మద్దతు ధరకు అమ్ముకోవాలన్న ఆశ కేంద్రానికి వెళితే మిల్లర్లు బాగా ఇబ్బంది పెడుతున్నారు. కొనుగోలు కేంద్రంలో తేమ శాతం చూపించుకొని వెళ్లినా మిల్లర్ల వద్ద తేమ శాతంలో తేడా ఉంటుంది. విసిగి దళారులకు రూ.1300 నుంచి రూ.1400లోపే అమ్ముకుంటు న్నాం.

– కె.వెంకటేశ్వరరావు, రైతు, కొల్లూరు

టోకెన్ ఇచ్చి తిప్పుతున్నారు...



గత ప్రభుత్వంలో రైతుల వద్దకే ఆర్‌బీకే సిబ్బంది వచ్చి ధాన్యం కొనుగోలు చేసేవారు. మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు ప్రభుత్వ ధర కన్నా ఎక్కువ పెట్టి కొనేవారు. ఇప్పుడు రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే వారి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. టోకెన్ ఇచ్చిన తర్వాత కూడా తిప్పుతున్నారు. గత్యంతరం లేక అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది. నేను మూడు ఎకరాలు సాగుచేశా. పంట అమ్ముకోవడానికి అవస్థలు పడాల్సి వస్తోంది.

–బాలసుబ్రహ్మణ్యం, రైతు, అద్దేపల్లి, భట్టిప్రోలు మండలం.

డిస్ట్రిబ్యూటరీ కమిటీల్లోనూ అరాచకమే

- ఏకపక్షంగా ఎంపికలు
- 21 డిస్ట్రిబ్యూటరీలు ఏకగ్రీవం
- పొన్నూరు–3 డిస్ట్రిబ్యూటరీలో ఇద్దరి మధ్య పోటీ
- టై అయిన ఎన్నిక, లాటరీ ద్వారా ఎంపిక పూర్తి
- సర్కార్ తీరుపై సర్వత్రా విమర్శలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ప్రభుత్వ ఆదేశాలతో సాగునీటి సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను ఏకగ్రీవం చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన అధికారులు మంగళవారం జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల్లోనూ ఇదే పద్ధతి అవలంభించడం చర్చనీయాంశంగా మారింది. ఈనెల 14వ తేదీన జిల్లాలోని 170 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అధికారులు, పోలీసులు కలిసి ప్రతిపక్షపార్టీలతోపాటు అటు స్వపక్షంలోనూ ఎవరూ పోటీపడకుండా బెదిరింపుల పర్వానికి తెరతీసి ఎన్నికలను ఏకపక్షం చేశారు. 170 మంది సాగునీటి సంఘాలు ప్రతినిధులు 22 డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాల్సి వుండగా మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. 21 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగకుండా చూసి ఏకపక్షం చేశారు. పొన్నూరు–3 డిస్ట్రిబ్యూటరీకి మాత్రమే ఎన్నిక జరగ్గా ఇద్దరు పోటీపడడంతో ఎన్నిక టై అయింది. దీంతో లాటరీ పద్ధతిలో ఎన్నిక నిర్వహించగా అప్పికట్లకు చెందిన శ్రీకాంత్‌బాబు డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. జిల్లాలో కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో 92 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 14 డిస్ట్రిబ్యూటరీలు ఉండగా నాగార్జునసాగర్ పరిధిలో 62 సాగునీటి సంఘాలు, 8 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 16 సాగునీటి సంఘాలు ఉన్నాయి. జిల్లా అధికారులు దగ్గరుండి ఎన్నికలను ఏకపక్షంచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయంతో ఉపయోగాలు



వేటపాలెం: జిల్లా సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సాగు విధానాన్ని గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు చెందిన అగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రామ్‌కు చెందిన 13 మంది సభ్యుల బృందం వేటపాలెం మండలానికి మంగళవారం వచ్చారు. వీరికి స్థానిక రైతుసేవా కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయంలో నిర్వహిస్తున్న తొమ్మిది సూత్రాలు, తయారీ వాడకం గురించి వ్యవసాయ అధికారులు చేసి చూపి అవగాహన కల్పించారు. అనంతరం పందిళ్లపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా తొమ్మిది మంది రైతులు 13 ఎకరాల్లో సాగు చేస్తున్న దేశవాళీ వరి పంటలను సందర్శించారు. ప్రకృతి సాగు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలు గురించి బృదం సభ్యులు తెలుసుకున్నారు. గ్రామంలో గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో అమలు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు, సంఘ సభ్యుల పాత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ రాష్ట్ర సీనియర్ తీమాటిక్ లీడర్ ప్రకాష్‌రావు, శ్రీనివాసరావు, ఏడీ శ్రీనివాసరావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రాజెక్టు మేనేజర్ వీ వాణీశ్రీ, ఏఓ ఐ కాశీవిశ్వనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు రైతును కలిసిన ఉప ముఖ్యమంత్రి

మంగళగిరి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి అన్నదాతల సమస్యలు విన్నవించేందుకు అనంతపురం జిల్లా హిందూపురం నుంచి వచ్చిన రైతు నవీన్‌కుమార్‌కు ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ దర్శనమిచ్చారు. సాక్షి దినపత్రికలో మంగళవారం 'సమస్యలు పరిష్కరించాలి ఎడ్ల బండి కట్టి' అంటూ ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉప ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం నవీన్‌కుమార్‌ను కలిశారు. అనంతరం నవీన్ కుమార్ మాట్లాడుతూ.. దళారుల బెడద తప్పించాలని, పంటకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్‌లో విక్రయించుకునేలా చూడాలని కోరారు. వినతిపత్రాన్ని కార్యాలయంలో ఇవ్వాలని తెలపగా, ఆ మేరకు అందజేసినట్లు తెలిపారు.

ఎన్‌సీసీ కోటాలో అగ్రిసెట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుల్లో ఎన్‌సీసీ కోటాలో అగ్రిసెట్ 2024 ద్వారా ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు.

18 నుంచి లెవెల్ క్రాసింగ్ గేటు మూసివేత

లక్ష్మీపురం: మంగళగిరి నుంచి నిడమర్రు వరకు రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో మూడు రోజులపాటు నంబూరు–మంగళగిరి మధ్య లెవెల్ క్రాసింగ్ గేటును మూసి వేయనున్నట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు లెవెల్ క్రాసింగ్ గేటు మూసి వేయడం వల్ల ట్రాఫిక్‌ను డాన్‌బాస్కో స్కూల్– నవులూరు సెంటర్–క్రికెట్ స్టేడియం రోడ్డు –నిడమర్రు మీదుగా మళ్లించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనులలో నిర్లక్ష్యం తగదు

మాచర్లరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులందరూ సమష్టిగా పనిచేయాలని పల్నాడు జిల్లా ఏపీడీ కె.మల్లికార్జునరావు కోరారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు, తాళ్ళపల్లి, చింతలతండ, నాగులవరం గ్రామాలలో మినీ గోకులం షెడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్‌లో మినీ గోకులం షెడ్ల నిర్మాణం కోసం తలపెట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా ఉపాధి హామీ పనులు అందించాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో ఉపాధి హామీ పథకం కీలకమైందని అన్నారు.

'నాటు' పరవళ్లు



రామ్‌నగర్ ప్రాంతంలో డ్రమ్ముల్లో ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

- పేద, మధ్య తరగతి బతుకుల్లో సారా చిచ్చు
- కుటీర పరిశ్రమగా సారా తయారీ
- విక్రయాలపై దృష్టి పెట్టని ఎక్సైజ్, సివిల్ పోలీసులు

చీరాల: జిల్లాలో నాటు సారా తయారీ పరవళ్లు తొక్కుతోంది. గుట్టు చప్పుడుగా ఇంట్లోనే సారా తయారీ జరుగుతున్నా సంబంధిత అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. సారాపై ఉక్కుపాదం మోపుతామని పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నా అమలులో మాత్రం ఆ చిత్తశుద్ధి కనిపించడం లేదు. సారా తయారీదారులపై కేసులు పెట్టినా అక్రమంగా సారా తయారీ యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. చీరాల ప్రాంతంలో ఎక్కువగా నివసించేది బడుగు, బలహీన వర్గాల వారే. కాయకష్టం చేసుకుని బతుకులు సాగిస్తుంటారు. పని ఒత్తిళ్లు, మరో ఇతర కారణాల వలన మద్యం మత్తుకు ఎక్కువ మంది బానిసలవుతున్నారు. కూలీ, నాలీ చేసుకుని బతికే ఈ వర్గాలు మద్యం కొనుగోలు చేసి తాగే ఆర్థిక స్తోమత లేక ప్రత్యామ్నాయ మార్గంగా సారా వైపు మళ్లారు. దీంతో కొన్నేళ్లుగా చీరాల ప్రాంతంలో సారా పరవళ్లు తొక్కుతోంది. చీరాలకు కూత వేటు దూరంలోని స్టూవర్టుపురం మందుబాబులతో కోలాహలంగా ఉంటుంది. కడుపునిండా తాగి తమతో కలిసి మద్యం తాగే వారికి పార్శిల్ రూపంలో కొనుగోలు చేసి రైళ్లలో రోజు తెస్తుంటారు. వేటపాలెం, పందిళ్లపల్లి, జాండ్రపేట, రామకృష్ణాపురం, చీరాల, ఈపూరుపాలెంతో పాటు చినగంజాం, పలు ప్రాంతాల నుంచి రోజూ స్టూవర్టుపురం వెళ్లి సారా తాగి వెంటకూడా తెచ్చుకోవటం నిత్యకృత్యం. చీరాలతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో జోరుగా సారా విక్రయాలు, తయారీ చేస్తున్నారు. నాటు సారా లభించని గ్రామాలు లేవంటే అతిశయోక్తి కాదు.

గ్లాస్ రూ.20, క్వార్టర్ రూ.30

కొన్నేళ్లుగా కొందరు నాటుసారా తయారు చేస్తూ జీవనం గడుపుతున్నారు. చాటుమాటుగా కాకుండా ఇళ్ల వద్దే సారా కాస్తున్నారంటే సారా అమ్మకాలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. చీరాల, రామ్‌నగర్, ఆదినారాయణపురం, సాయికాలనీ, తోటవారిపాలెం వీవర్స్ కాలనీకి చెందిన కొందరు స్టూవర్టుపురంలో ఐదు లీటర్ల క్యాన్ రూ.500 కొనుగోలు చేసి, మందుబాబులకు గ్లాస్ రూ.20, క్వార్టర్ రూ.30–50 చొప్పున విక్రయిస్తున్నారు. క్వాలిటీని బట్టి డబ్బులు వసూలు చేస్తుంటారు.

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ పోలీసులు..

నాటుసారా వ్యవహారాన్ని స్థానిక ఎక్సైజ్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటారు. స్టూవర్టుపురం నుంచి ఆటోలు, బైకుల్లో నేరుగా చీరాలకు తరలిస్తుంటారు. ఎక్సైజ్ పోలీసులపై సారా అమ్మే మాజీ నేరస్తులు పలుమార్లు దాడులు చేసి గాయపరిచిన ఘటనలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తోపాటు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సబ్‌డివిజన్ టాస్క్‌ఫోర్స్ ఉన్నప్పటికీ వారు సారా నియంత్రించటంలో నామమాత్రంగా కూడా దృష్టి పెట్టటం లేదు.

స్థానికంగా కూడా తయారీ..

గతంలో కేవలం స్టూవర్టుపురంలో సారా తయారై చీరాలకు అక్రమ రవాణా జరుగుతుండేది. కానీ సారాకు డిమాండ్ పెరగటంతో స్థానికంగా తయారు చేస్తున్నారు. ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్ పక్కన, రామ్‌నగర్ గ్యాంగ్‌లో, మత్స్యకార గ్రామమైన వాడరేవులో, విజిలీపేట, జాలమ్మ గుడి, ఫ్లెక్సీవర్ బ్రిడ్జి క్రింద, జవహర్‌నగర్ ప్రాంతాల్లో కాపుసారా అమ్మకాలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా ఎక్సైజ్ పోలీసులు చొరవ చూపి సారా మహమ్మారిని చీరాల ప్రాంతం నుంచి తరిమికొట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాటు సారాను పూర్తిగా అరికడతాం..

సారా తయారీ అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశాం. ప్రధానంగా తమ శాఖలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీని వలన కూడా తరచూ దాడులు చేయడం కష్టతరంగా ఉంది. త్వరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి నాటుసారాను పూర్తిగా అరికడతాం.

– నాగేశ్వరరావు, ఎక్సైజ్ సీఐ

పేదలపై ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ దాదాగిరి

- కిస్తీలు కట్టనందుకు ఇంటికి తాళం వేసి సీజ్ చేసిన వైనం
- మహిళలు, చిన్నపిల్లలు అని కూడా చూడకుండా దౌర్జన్యం



సీలు వేసిన ఇంటి ముందు నిల్చున్న బాధిత కుటుంబం



ఇంటికి తాళం వేసి సీల్ వేస్తున్న సిబ్బంది

జే.పంగులూరు: పేదల అమాయకత్వాన్ని కొన్ని ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు ఆసరాగా తీసుకొని కుటుంబాలను రోడ్డున పడేస్తున్నాయి. పేదలనే టార్గెట్ చేస్తూ అప్పు ఇస్తామని చెప్పి మోసాలకు పాల్పడుతున్నాయి. ఫైనాన్స్ కంపెనీ తరుపున ఇద్దరు, ముగ్గురు బ్రోకర్లను పెట్టుకొని వారి ద్వారా గ్రామాల్లో రుణాలు ఇప్పిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామానికి చెందిన దళిత మహిళ ఆలూరి సుజాత ఐఐఎఫ్ఎల్ (ప్రైవేటు ఫైనాన్స్ సర్వీస్ కంపెనీ) వద్ద 15 నెలల కిందట రూ.5.50 లక్షలు రుణం తీసుకుంది. లోను నిమిత్తం తెలిసిన వారి వద్ద రూ.50 వేలు అప్పు తీసుకొని ఇంటిని రిజిస్ట్రేషన్, మార్టిగేజ్ చేయించింది. ఫైనాన్స్ కంపెనీ వారు బీమా అని అవీఇవీ చెప్పి రూ.5.50 లక్షల రుణాకిగాను రూ.4.84 లక్షలు చేతిలో పెట్టారు. వాటిలో కూడా మొదటి నెల కిస్తీ వారి వద్దనే ఉంచుకున్నారని బాధితురాలు తెలిపింది.

84 నెలలపాటు కిస్తీ..

రూ.5.50 లక్షలకు 84 నెలలపాటు ప్రతి నెలా రూ.13,165 చెల్లించాలని తెలిపారు. 15 నెలలకుగాను ఇప్పటికే 12 నెలలు డబ్బులు కంపెనీకి చెల్లించానని బాధితురాలు తెలిపింది. నాలుగు రోజుల కిందట రెండు నెలల డబ్బులు ఒకేసారి చెల్లించానని, మిగిలినవి ఈ నెలాఖరుకు చెల్లిస్తానని బాధితురాలు తెలిపింది. కానీ కంపెనీ సిబ్బంది అవేమి వినకుండా మంగళవారం మధ్యాహ్నం 1 గంట సమయంలో వచ్చి బీభత్సం చేశారు. మొత్తం ఆరుగురు సిబ్బంది వచ్చి, ఇంట్లో ఉన్న నన్ను, నా కోడలిని, మనవరాలిని బయటకు లాగి ఇంటి తాళం వేసి సీలు వేశారని వాపోయింది. ' నీ దిక్కున్న వాడికి చెప్పుకో'.. అని ఇష్టానుసారంగా మాట్లాడారని బాధితురాలు కన్నీటి పర్యంతమైంది. ఇంటికి తాళం వేసి వెళ్తే చిన్న పిల్లలను పెట్టుకొని నేను ఈ చలిలో ఎక్కడ ఉండాలని ఆవేదన వ్యక్తం చేసింది.

గ్రామంలో 70 మంది వద్ద అధిక వసూళ్లు..

గ్రామంలో ఒక్క దళిత కాలనీలో 120 కుటుంబాలకుగాను 70 మంది వరకు పలు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల వద్ద లోన్లు తీసుకున్నారని కాలనీ వాసులు తెలిపారు. పేదవారినే టార్గెట్ చేసి వారిని ఉన్న కొద్దిపాటి ఆస్తిని కూడా తనఖా పెట్టించుకొని మాఫియా రెచ్చిపోతున్నారని దళితులు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో కంపెనీలకు ఏజెంట్లుగా పనిచేస్తున్న సిబ్బంది పేదలకు లేనిపోని ఆశలు పెట్టి నిండా ముంచుతున్నారు. ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

వాయుగండం

- ఓదెలపై వరి పంట
- కట్టివేత పనుల్లో రైతులు నిమగ్నం
- పంట కాపాడుకునేందుకు పరుగులు



రేపల్లెలో ఓదెలపై ఉన్న వరిపైరు

రేపల్లె రూరల్: వరుస తుపానులు, అల్పపీడనాలు రైతులను వణికిస్తున్నాయి. పంట చేతికొచ్చే దశలో వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతన్న కంటి మీద కునుకు లేకుండా పోతోంది. తెగుళ్లు లేకపోవటంతో పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చే అవకాశం ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. నియోజకవర్గంలోని రేపల్లె మండలం నల్లూరుపాలెం, తుమ్మల, పోటుమెరక, పేటేరు, బొందలగరువు, కైతేపల్లి, నిజాంపట్నం మండలం కూచినపూడి, పల్లపట్ల, నగరం మండలం నగరం, దూళిపూడి, ఈదుపల్లి, చెరుకుపల్లి మండలం చెరుకుపల్లి, గుళ్లపల్లి, కావూరు, కనగాల, రాంబొట్లపాలెం గ్రామాలలో అధికశాతం పంట కోత దశలో ఉండటంతోపాటు, కోతలు పూర్తయి ఓదెలపై ఉంది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవటంతో రైతులు పంటను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నాడు. ఇప్పటికే కోతకు సిద్ధమైన పంటతో పాటు కోత కోసి ఓదెలపై ఉన్న పంటను కాపాడుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. కోతలు కోసి ఓదెలపై ఉన్న పంటను కట్టలు కట్టి కుప్పలు వేస్తున్నారు. మరికొంతమంది పంటను రోడ్లపై ఆరబెట్టి నూర్పిళ్లు చేస్తున్నారు.

కూలీలకు డిమాండ్

సాధారణ రోజుల్లో కట్టివేతకు ఎకరాకు రూ.4వేల నుంచి రూ.5వేలు తీసుకునే కూలీలు ప్రస్తుతం రూ.7వేల నుంచి రూ.8వేలు వరకు డిమాండ్ చేస్తున్నారు. చేసేది లేక కూలీలు అడిగినంత చెల్లిస్తున్నారు.



కూచినపూడి వద్ద ఓదెలు తిరగేస్తున్న వ్యవసాయ కూలీలు



కూచినపూడి గ్రామంలో కుప్పలు వేస్తున్న రైతు

క్లుప్తంగా

వ్యవసాయ కళాశాలలో పెన్షనర్స్ డే



బాపట్ల: పింఛనుదారులు తమ విరామ సమయాన్ని సేవా కార్యక్రమాలలో పాలు పంచుకోవడం ద్వారా ఒంటరితనాన్ని పోగొట్టుకోవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డాక్టర్ పి.ప్రసూనరాణి అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో నాన్ టీచింగ్ పెన్షనర్స్ అసోసియేషన్ నిర్వహించిన పెన్షనర్స్ డే సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డీన్ డాక్టర్ ప్రసూనరాణి మాట్లాడారు. వృద్ధాప్యం వయసుకే గాని మనసుకు కాదన్నారు. పింఛనుదారులు తేలికపాటి వ్యాయామాలైన నడక, యోగ, ప్రాణాయామం చేస్తూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. భీమశంకరరావు అధ్యక్షత వహించిన ఈ సభలో పింఛన్‌దారులు షేక్ మస్తాన్‌వలి, కె.సుబ్బారావు, ఎస్.గురుమూర్తి, జి.ఏసోబు, కె.కమలమ్మ, సీహెచ్.సత్యనారాయణ, కె.సాంబయ్య, కె.బసవయ్య, శ్యాంసన్ తదితరులను సత్కరించారు. అడ్మినిస్ట్రేటివ్ అధికారి బి.అరవింద్, కొటికలపూడి సోమయ్య, కె.భాస్కరరావు, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీటీఎస్‌లో క్రీడా పోటీలు ప్రారంభం



గుంటూరు రూరల్: నల్లపాడులోని ఎంబీటీఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో ఐపీఎస్ జీఎం 2024 పేరుతో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి, చలపతి మెటల్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ పి.వెంకటేశ్వరరావులు బెలూన్‌లు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు నిర్వహిస్తున్న సాంకేతిక విద్యా శాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్‌కి ప్రిన్సిపల్ టి.శేఖర్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా రీజినల్ స్పోర్ట్స్‌కు జిల్లా వ్యాప్తంగా 19 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 418 మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. విజేతలకు బుధవారం బహుమతులు ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రాణించిన రాజస్థాన్ బౌలర్లు

204 పరుగులకు విదర్భ ఆలౌట్

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న విజయ్ మర్చంట్ ట్రోఫీ అండర్-16 క్రికెట్ మ్యాచ్‌లో మంగళవారం రాజస్థాన్ బౌలర్లు రాణించారు. రాజస్థాన్, విదర్భ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భ జట్టు 73.4 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌటైంది. విదర్భ బ్యాట్స్‌మెన్ ఓంధోర్ 132 బంతులలో 12 ఫోర్లతో 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. కష్యప్ రత్నాకర్ 35 పరుగులతో రాణించాడు. రాజస్థాన్ బౌలర్లు పి ద్వొదాల్, సుజాల్ పర్‌మార్, ఆదిత్యలు మూడేసి వికెట్లు తీసి సత్తా చాటారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు కూటమి వేధింపులు

- నగరం మండలంలో ఏడుగురు తొలగింపు
- నియోజకవర్గంలో 17 మంది ఇంటికి



రేపల్లె రూరల్: కూటమి ప్రభుత్వ వేధింపుల పర్వం రోజురోజుకు పెరిగిపోతుంది. అక్రమార్జనకు అడ్డుగా ఉన్న ఎన్‌ఆర్‌ఈఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి వేధింపులకు గురిచేస్తుంది. అక్రమార్జనకు సహకరించడం లేదని కొందరిని, గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారని మరికొందరిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు 17 మంది ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. నగరం మండలంలో అత్యధికంగా ఏడుగురిని, రేపల్లెలో ఐదుగురిని, నిజాంపట్నంలో ముగ్గురిని, చెరుకుపల్లిలో ఇద్దరిని తొలగించి ఉపాధి అవకాశాలను దెబ్బ కొట్టారు.

పోలీసుల ద్వారా వేధింపులు

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అండదండలతో ద్వితీయశ్రేణి నాయకుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా నగరం మండలంలో పోలీసులను అడ్డుపెట్టుకుని తమకు అనుకూలంగా లేని ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నకిలీ జాబ్‌కార్డులను సృష్టించి పనిదినాలు చేయకుండా చేసినట్లు మస్టర్‌లో చూపిస్తూ లక్షల్లో నగదు స్వాహా చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తంతుకు సహకరించని నగరం మండలంలోని ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్‌లను తొలగించాలని కూటమి నేతలు పట్టుబట్టడంతో వారిని ఆరు నెలల కిందట అధికారులు తొలగించారు. తామేమి తప్పులు చేయలేదంటూ అక్రమంగా తొలగించారంటూ ఫీల్డు అసిస్టెంట్‌లు కోర్టును ఆశ్రయించారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. పచ్చనేతల ఒత్తిడికి తలొగ్గిన అధికారులు ఏడుగురు ఫీల్డు అసిస్టెంట్‌లను విధుల్లోకి తీసుకోకపోగా అక్రమ చర్యలను బనాయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు గతంలో పీఏగా పనిచేసిన ఓ వ్యక్తి మండల అధికారులు, పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. పచ్చపార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన పోలీసులు పగలు రాత్రి తేడా లేకుండా ఫీల్డు అసిస్టెంట్‌లను స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారు.

నాయకుల ఒత్తిడితో ముందుగానే తనిఖీలు

సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు ప్రతి ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించాల్సి ఉండగా స్థానిక నాయకులు జిల్లా అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి డిసెంబర్ నెలలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. సామాజిక తనిఖీలకు రికార్డులు అవసరం కావటంతో విధుల నుంచి తొలగింపునకు గురైన ఏడుగురు ఫీల్డు అసిస్టెంట్‌లను పిలిచి రికార్డులు ఇవ్వాలంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. తమ వద్ద రికార్డులు లేవని చెబుతుండటంతో పోలీసులను అడ్డుపెట్టుకుని విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ మండలస్థాయి అధికారులు నాయకులకు ఒత్తాసు పలకటంతో ప్రజలు, ప్రజాసంఘాలు పెదవి విరుస్తున్నాయి.

నగదు తిరిగివ్వలేదని యువకుడి దారుణ హత్య



దీపక్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌వో వీరసోమయ్య

పట్నంబజారు: నగదు తిరిగి ఇవ్వలేదని ఓ యువకుడిని కొందరు కొట్టి చంపిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలిలోని చెంచుపేటలో నివాసం ఉండే చప్పిడి దీపక్ (27)కు గద్దల కిరణ్ స్నేహితుడు. ఇద్దరూ మద్యం తాగి తిరుగుతుండేవారు. కిరణ్ కొద్ది కాలం క్రితం గుంటూరుకు వచ్చి ఎస్వీఎన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఏప్రిల్‌లో తెనాలిలో దీపక్, కిరణ్ మద్యం తాగారు. కిరణ్ మత్తులో ఉండగా అతడి ఫోన్ నుంచి దీపక్ రూ. 53 వేలు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. దీనిపై ఇద్దరూ గొడవ పడ్డారు. దీపక్ తండ్రి చంద్రశేఖరరావు దఫాలుగా ఆ మొత్తం తిరిగి ఇస్తానని చెప్పాడు. కానీ ఇవ్వకపోవటంతో దీపక్‌ను భయపెట్టి డబ్బులు తీసుకోవాలని కిరణ్ నిర్ణయించుకున్నాడు. నాలుగు రోజులుగా తెనాలి వెళుతూ దీపక్‌తో కలిసి మద్యం తాగుతూ మంచి చేసుకున్నాడు. ఈ నెల 16వ తేదీన రాత్రి కూడా మద్యం తాగించి, గుంటూరులో ఇంత కంటే మంచి పార్టీ ఉందని నమ్మబలికి తీసుకొచ్చాడు. పాతగుంటూరు బాలాజీనగర్ సమీపంలోని రాజీవ్ గృహకల్ప సముదాయం సమీపంలోని ఖాళీ స్థలంలోకి చేరుకున్నారు. అప్పటికే గుంటూరులో కిరణ్ స్నేహితులైన రవి, అక్బర్, అశోక్, గోపిలతో కలిసి పక్కా ప్లాన్ సిద్ధం చేశాడు. డబ్బులు ఇవ్వకుంటే హత మార్చాలనే నిర్ణయంతో వారు ఉన్నారు. ఈ క్రమంలో కర్రలతో దీపక్‌ను ఇష్టానుసారం కొట్టి ఓ ఆటో మాట్లాడి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి పంపారు. అతడి పేరు వెంకటరెడ్డి అని ఆటోవాలాకు చెప్పారు. ఏ ఒక్కరూ ఆసుపత్రి దగ్గరకు రాలేదు. దీంతో రాత్రి 2 గంటల సమయంలో ఆటో డ్రైవరు ఆసుపత్రిలో దీపక్‌ను చేర్చి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలకు చికిత్స పొందుతూ దీపక్ తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మృతి చెందాడు. జీజీహెచ్‌లోని అవుట్‌పోస్ట్ నుంచి సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పాత గుంటూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో వై. వీరసోమయ్య మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసింది. దీపక్ సోదరుడు తరుణ్ కూడా కొద్ది సంవత్సరాల క్రితం తెనాలిలో హత్యకు గురైనట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ అధికారుల తీరు ఆక్షేపణీయం



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులను ఉద్యమాల వైపు అధికారులే బలవంతంగా నెడుతున్నారని ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. గుంటూరులోని కొత్తపేటలో ఉన్న జిల్లా సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగంభవన్‌లో మంగళవారం ఈయూ జిల్లా స్థాయి విస్తృత కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా అధ్యక్షతన జరిగింది. ఇందులో దామోదరరావు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు జోనల్ కార్యదర్శి దాసరి బాబూ శామ్యూల్, జిల్లా కార్యదర్శి ఇ.విజయ్ కుమార్, స్టేట్ మెయింటెనెన్సు కమిటీ మెంబర్ ధనుంజయరెడ్డి, నాయకులు డి.వి.స్వామి, ఎ.పి.రావు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన టిప్పర్.. వ్యవసాయ కూలీ మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): టిప్పర్ ఢీకొని వ్యవసాయ కూలీ మృతిచెందిన ఘటన భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లాకు చెందిన కాగితాల విక్టోరియా, భర్త ధర్మారావు (60) గొల్లపూడికి చెందిన వెలగపూడి రామకోటేశ్వరరావు వద్ద వ్యవసాయ పనులు చేస్తున్నారు. మంగళవారం ధర్మారావుతో పాటు మరికొంతమంది కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం గొల్లపూడి నుంచి రాయనపాడు ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పైపుల కంపెనీ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ట్రాక్టర్‌ను వేగంగా ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్‌పైన ఉన్న ధర్మారావు కింద పడ్డారు. టిప్పర్ ధర్మారావు మీదుగా వెళ్లటంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుని భార్య విక్టోరియా ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23 బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వహణకు నోటిఫికేషన్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరులో జిల్లాలో 23 బార్ అండ్ రెస్టారెంట్‌లు, ప్రీమియం లిక్కర్ స్టోర్ నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. గత ప్రభుత్వంలో హయాంలో మూడేళ్ల కాలపరిమితి (2022-25) బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహించుకునేందుకు టెండర్ ప్రక్రియ నిర్వహించిన విషయం తెలిసిందే. వాటిలో కొన్ని బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు ప్రతి సంవత్సరం లైసెన్స్ రెన్యూవల్ చేసుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 23 బార్ అండ్ రెస్టారెంట్లు మిగిలిపోయాయి. అందులో మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీ పరిధిలో 1, తెనాలిలో 5, పొన్నూరు 2, రేపల్లె 1, పిడుగురాళ్ల 6, మాచర్ల 3, గురజాల 2, దాచేపల్లి 3 ఉన్నాయి. వీటి నిర్వహణకు వచ్చే ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు కాలపరిమితితో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 23న నిర్దేశిత దరఖాస్తు ఫీజు చెల్లించాలి. 24న ఆన్‌లైన్‌లోనే ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బిడ్డింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఎక్కువ బిడ్డింగ్ వేసిన వారికి నిర్వహణ లైసెన్స్ ఇస్తామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. అదే విధంగా గుంటూరులో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు (5 ఏళ్ల కాలపరిమితితో) కూడా ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని చెప్పారు.

యార్డుకు 59,536 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 59,536 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 56,202 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 16,300 వరకు లభించింది.

చట్టాలే మహిళకు రక్షణ

బాలల సంక్షేమ కమిటీ ఉమ్మడి ప్రకాశం జిల్లా చైర్మన్ ఎం.రామాంజనేయులు



మాట్లాడుతున్న బాలల సంక్షేమ కమిటీ ఉమ్మడి ప్రకాశం జిల్లా చైర్మన్ ఎం.రామాంజనేయులు

బాపట్ల: మహిళలకు రక్షణగా చట్టాలు ఉన్నాయని, వాటిని మహిళలు అర్థం చేసుకుని ముందుకుపోవాలని బాలల సంక్షేమ కమిటీ ఉమ్మడి ప్రకాశం జిల్లా చైర్మన్ ఎం. రామాంజనేయులు పేర్కొన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల భవనంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయరాదని సూచించారు. మన దేశంలో ఆడపిల్లలను రక్షించుకునేందుకు ఉన్న చట్టాలను అవగాహన చేసుకోవాలని సూచించారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా కన్వీనర్ హేమలత మాట్లాడుతూ సమాజాభివృద్ధిని ఆ సమాజంలో మహిళల అభివృద్ధితో లెక్కిస్తానని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అన్న మాటలను గుర్తు చేశారు. మహిళలు లేని సమాజాన్ని ఊహించడం సాధ్యం కాదని అన్నారు. అలాంటి ఈ సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షత హేయం అన్నారు ఆడబిడ్డ పెళ్లి కోసం కాదు చదువు కోసం అని ప్రతి తల్లిదండ్రులు గుర్తించాలని అన్నారు. సమాజంలో మహిళల పట్ల లైంగిక వేధింపులు పరిపాటిగా మారాయని వీటిని నివారించేందుకు ఉన్న చట్టాలను మహిళలు అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ కే ఉషారాణి, లీగల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.మౌనిక, ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.ప్రియ, డీబీఆర్సీ రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు తులసి చంద్రశేఖర్, న్యాయవాది దగ్గుమల్లి కిరణ్‌కుమార్, ఐద్వా నాయకురాలు టి సుభాషిణి, డీబీఆర్సీ ఏరియా కోఆర్డినేటర్లు వి భగవాన్‌దాస్, శ్రీలత పాల్గొన్నారు.

వివాహితపై లైంగికదాడికి యత్నం

- దేహశుద్ధి చేసిన మహిళ బంధువులు
- నిందితుడిపై కేసు నమోదు
- దాడికి పాల్పడిన వారిపైనా కేసు నమోదు

కొల్లూరు: వివాహితపై ఓ వ్యక్తి లైంగికదాడికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరుకు చెందిన ఓ మహిళ తన భర్తతో కలసి జీవనం సాగిస్తుంది. ఆదివారం రాత్రి కోన బాజి అనే వ్యక్తి మహిళ భర్తతో కలసి మద్యం సేవించాడు. అతిగా మద్యం తాగిన మహిళ భర్తను ఇంటి వద్ద దిగబెట్టేందుకు వెళ్లిన బాజీ వారి ఇంటిలోనే నిద్రకు ఉపక్రమించాడు. ఆమె తన భర్తతో కలసి వేరే గదిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో తలుపులు కొట్టి నిద్ర లేపిన బాజి తనకు మంచినీరు కావాలని కోరాడు. ఆమె మంచినీరు అందించింది. అనంతరం మూత్ర విసర్జనకు బయటకు వెళ్లి వచ్చిన నిందితుడు ఆమెను గట్టిగా పట్టుకొని లైంగికదాడికి యత్నించాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో భర్త నిద్ర నుంచి లేవడంతోపాటు, చుట్టుపక్కల వారు అక్కడకి చేరుకున్నారు. ఇది గమనించిన నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే స్థానికులు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకి చేరుకొని వివరాలు సేకరించారు. సోమవారం ఉదయం జమ్మిచెట్టు ప్రాంతంలో ఉన్న నిందితుడ్ని బాధితురాలి తరపు బంధువులు, వారికి పరిచయం ఉన్న వ్యక్తులు మూకుమ్మడి దాడి చేసి దేహశుద్ధి చేశారు. వారి నుంచి తప్పించుకున్న బాజీ రక్షణ కోసం పోలీసుస్టేషన్‌కు వెళ్లాడు. అనంతరం పోలీసుస్టేషన్‌కు చేరుకున్న బాధితురాలి బంధువులు విషయం పోలీసులకు వివరించారు.

రాజీ ప్రయత్నాలు విఫలం

కూటమి ప్రభుత్వంలోని ఓ రాజకీయపార్టీకి చెందిన నాయకుడు కేసులు వద్దని ఇరు పక్షాలు రాజీ పడతారని చెప్పడంతో తొలుత పోలీసులు కేసులు నమోదు చేయకుండా పంపించి వేశారు. వైద్య చికిత్స కోసం నిందితుడు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేరాడు.

దీనితో తొలుత కేసు నమోదుపై ఉదారత చూపిన పోలీసులు అప్రమత్తమై సోమవారం అర్ధరాత్రి బాజీపై కేసు నమోదు చేశారు. దాడి చేసిన బాధిత మహిళ తల్లి తిరుపతమ్మ, నరేష్‌లపై కూడా కేసు నమోదు చేశారు.

విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కొరిటెపాడు (గుంటూరు): కరెంటు చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక ఆ మేరకు కట్టుబడి ప్రజలపై విద్యుత్తు చార్జీల భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ప్రజలపై భారం మోపే ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు, విద్యుత్ సర్దుబాటు చార్జీలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పొన్నూరు రోడ్‌లోని విద్యుత్ శాఖ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. నేతాజీ మాట్లాడుతూ... సర్దుబాటు చార్జీల పేరుతో, స్మార్ట్ మీటర్లు పెడతామంటూ ప్రజలపై భారం వేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే రూ.15,486 కోట్ల భారం వేయడం అమానుషమని మండిపడ్డారు. పార్టీ నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్ల మార్పు వినియోగదారులకు తీవ్ర నష్టమన్నారు. దీనికోసం నెలకు రూ.100 నుంచి రూ.150 వరకు వాయిదాల పద్ధతిలో మొత్తం రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తారని ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ముక్కలు చేసి ప్రైవేటు వ్యక్తులకు ఇప్పటికే అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ, వృత్తిదారులు, వ్యవసాయానికి రాయితీలు క్రమంగా తొలగించనున్నట్లు ఆరోపించారు. డిమాండ్లపై విద్యుత్ శాఖ సీనియర్ అసిస్టెంట్ పాశం రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎన్.భావన్నారాయణ, ఈమని అప్పారావు, ముత్యాలరావు, డి.లక్ష్మీనారాయణ, డి.శ్రీనివాసరావు, షేక్ మస్తాన్, లక్ష్మణరావు, ఖాసిం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు క్రికెట్ ప్రాక్టీస్ కోర్ట్

- 1999 ఎంబీబీఎస్ బ్యాచ్ దాతృత్వం
- రూ. 10 లక్షలతో ఏర్పాటు
- పలు అభివృద్ధి పనులకు రూ.2 కోట్లు



బ్యాటింగ్ చేస్తున్న డాక్టర్ సుందరాచారి

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలిచాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగార్జున కొండ వెంకట సుందరాచారి అన్నారు. మంగళవారం గుంటూరు అమరావతి రోడ్డులోని మెడికల్ కాలేజ్ మెన్స్ హాస్టల్‌లో క్రికెట్ ప్రాక్టీస్ కోర్టులను ఆయన ప్రారంభించారు. 1999 బ్యాచ్‌కు చెందిన బాహుబలి సర్జన్, బ్రింద హాస్పటల్ అధినేత డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి, అమెరికాలో స్థిరపడిన డాక్టర్ పుణ్యాల శ్రీనివాసరెడ్డిలు క్రికెట్ ప్రాక్టీస్ కోర్టులు మూడు నిర్మించేందుకు రూ. 10 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ బ్యాచ్ వారు రూ. 80 లక్షలతో రెండు బస్సులు ఇచ్చారని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కళాశాలలో పలు విభాగాల అభివృద్ధి కోసం రూ. 2 కోట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. డాక్టర్ భవన హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తమ బ్యాచ్‌మెట్ కొప్పురావూరి హరికిరణ్ జ్ఞాపకార్థంగా ఈ కోర్టును నిర్మించామన్నారు. తమ బ్యాచ్ ఎంబీబీఎస్ కోర్సు అభ్యసించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రీ యూనియన్ ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు. ప్రిన్సిపల్ సూచనతో రూ.రెండు కోట్ల విరాళాలు సేకరించామని వెల్లడించారు. తమ బ్యాచ్‌కు చెందిన వైద్యులు ప్రణతి, లావణ్య, పవన్, సంతప్‌లు అకాల మృతి చెందారని.. వారి జ్ఞాపకార్థంగా మెన్స్ హాస్టల్‌కు రెండు వాషింగ్ మెషిన్లు విరాళంగా ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో 1999 బ్యాచ్‌కు చెందిన వైద్యులు సునీల్‌కుమార్ నాయక్, కందుల రాము, సుధీర్, గుత్తి నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, గోపాటి నాగేశ్వరరావు, రవి, వైస్ ప్రిన్సిపల్స్ ప్రభాకర్, శ్రీధర్, హాస్టల్ వార్డెన్, ఫోరెన్సిక్ ప్రొఫెసర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మనసున్న మహారాజు పీవీజీ రాజు

ఘనంగా డాక్టర్ పి.వి.జి.రాజు విద్యా పురస్కారాల ప్రదానం



విష్ణువర్ధన్‌ను సత్కరిస్తున్న అశోక్ గజపతి రాజు, బుద్ధ ప్రసాద్, గజల్ శ్రీనివాస్

నగరంపాలెం: డాక్టర్ పి.వి.జి.రాజు మంచి మనసున్న మహారాజు అని కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు అన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మంగళవారం డాక్టర్ పి.వి.జి.రాజు శత జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా అశోక్ గజపతి రాజు మాట్లాడుతూ.. పి.వి.జి.రాజు దాతృత్వానికి నిలువుటద్దమని చెప్పారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి దాతృత్వం ఉన్న వ్యక్తి అని... డాక్టర్ పి.వి.జి.రాజు శత జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. బొమ్మిడాల శ్రీ కృష్ణమూర్తి ప్రసంగిస్తూ డాక్టర్ పి.వి.జి.రాజు తన కోటలను, ప్యాలెస్‌లను విద్యాసంస్థల కు అందించారని అన్నారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ప్రసంగిస్తూ పి.వి.జి.రాజు 250 ఎకరాల ప్యాలెస్‌ను కోరుకొండ సైనిక్ స్కూల్‌కి విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం డాక్టర్ పి.వి.జి.రాజు విద్యా పురస్కారాలను శారదానికేతన్ వ్యవస్థాపకుడు ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతుల వారసురాలు వి.హేమ, శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ వ్యవస్థాపకుడు పాటిబండ్ల సీతారామయ్య మనువడు విష్ణువర్ధన్‌కు, హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ (హీల్) వ్యవస్థాపకుడు డాక్టర్ కోనేరు సత్యప్రసాద్‌లకు అశోక్ గజపతి రాజు అందించారు. అనంతరం పెనుమెత్స నాగరాజు సహకారంతో ప్రచురించిన పూసపాటి రాజుల పూర్వోత్తరం చారిత్రక గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆర్.రాజేష్, పీవీ రమణ బృందం అభ్యుదయ గేయలాపన చేశారు. మానవత నేతలు పావులూరి రమేష్, టి.ధనుంజయరెడ్డి, రెడ్ క్రాస్ జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానీ రసూల్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఇండియన్ టొబాకో అసోసియేషన్ కార్యదర్శి యార్లగడ్డ చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి

వర్సిటీ మహిళా ఖోఖో టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థి దశలో క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవటం ద్వారా జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని విక్టరీ డిగ్రీ కళాశాల కార్యదర్శి ఒద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళా ఖోఖో పోటీలను మంగళవారం కళాశాల క్రీడా మైదానంలో ప్రారంభించారు. సుబ్బారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఆటలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందవచ్చన్నారు. మహిళలు అన్ని రంగాలలో ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. వర్సిటీ పరిధిలోని 9 కళాశాలల నుంచి ఖోఖో జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. కార్యక్రమంలో వర్సిటీ టోర్నమెంట్ పరిశీలకుడు డాక్టర్ పి.శివప్రసాదు, సెలక్షన్ కమిటి సభ్యులు డాక్టర్ ఏ.అరుణసుజాత, జి.బాలశంకర రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ పి.వేణుగోపాల్, పీడీ ఎన్.కృష్ణంరాజు పాల్గొన్నారు.